# ఊరిమిండి

స్వాములోరు వచ్చినాడని తెలిసినప్పటి నుంచి ఏదో ఆతృతగా వుంది లక్షుమ్మకు. గుండెల్లో సన్నని ఉద్వేగం ఒకటి మొదలై అది వూపిరిలో కలిసి నిరంతరాయంగా మోగుతూనే వుంది.

మిద్దె పంచలో కూసానికి ఆనుకొని కూచుని మాదిగిండ్ల లోంచి వచ్చే దారికేసి పదే పదే చూస్తోంది.

"పెద్దమ్మా! కాయలకోతకు రావా?" సుభద్ర పిల్చింది వీధిలోంచి.

"యీ పూట రాలేనుపో నాయినా!" చెప్పింది.

"ఏ పూటా రాకుంటే మాత్రం నీకేం తక్కువ? మా రాజువు - ఖర్మబట్టి పనికొస్పాండవుగాని...." అంటూ ముందుక్కదిలింది సుభద్ర.

సమాధానంగా బొడ్లోంచి అడపం పీకి దానికి చుట్టిన బొందెను విప్పింది లక్షుమ్మ. అడపం జేబుల్ని వేళ్ళతో పుణికి వక్కను తీసింది. దాన్ని వెనక ముందు నోటితో వూది, దవడపళ్లకింద పెట్టి ఒకటి రెండుసార్లు నొక్కి చూసింది. మూడవసారికి గాని వక్క పగలలేదు. సగం ముక్కనోట మిగిలిపోగా, వేళ్ల మధ్యకు జారిన మరో సగాన్ని అడపంలో వేసి కొంది. తమలపాకును కూడా సగానికి చించి నోట బెట్టుకొంది. సున్నం డబ్బీలోకి చూపుడు వేలిని జొనిపి లాఘవంగా ఓ చుట్ట తిప్పి సున్నం తీసి పళ్ళకు రాచుకొంటూంటే-

"లచ్చుమక్కా ! రొంత తమలపాకిస్పావా ?" మాదిగోల్ల లైసమ్మ గొంతు.

ఎగాదిగా ఒకసారి చూసింది లక్షుమ్మ.

అడపంలోంచి ఆకుతునకను తీసి ఆమె చేతిలో వేసింది. ఇంకా అక్కడే నిల్చుని అడపం దిక్కే చూస్తూ చాచిన చేతిని ముడుచుకోకుండా వున్న లైసమ్మ కేసి మరోసారి కిందికి పైకి చూసి అడపం లోంచి వక్కపలుకు తీసి "ఇదో..." అంది.

"వక్కా..." దాని అవసరం తనకేమంత లేనట్లు ధ్వనించేలా పలికి, అందుకొంటూ "పొగాకు పొడుంటే రొంత పెట్టుతల్లీ!" అంది లైసమ్మ.

"నీ కాడ ఏమున్నెట్టే పిల్లా ? - అన్నీ వుండి అదొక్కటే లేనెట్టు నంగి నంగిగా సెయ్యి జాపితివి - " పొగాకు పొడి కూడా విదిలించింది.

ముసిముసిగా నవ్వుకొంది లైసమ్మ.

లక్షుమ్మ అప్పటికే ఆతృత అణచుకోలేక పోతోంది.

"సోములోరికాడికి పోయినావంటనే..." కదిలించింది.

స్వాములోరి సంగతి చాలాసేపు చెప్పింది లైసమ్మ. అమెరికా నుంచి విమానంలో రావటం, మద్రాసులో దిగటం, అక్కన్నించి కొత్త కారులో రివ్వున వచ్చి తమ యిండ్లల్లో వాలటం... ఆయన ఆకారం... భాష... విలాసం.

ఆమె వెళ్లిం తర్వాత కూడా స్వాములోరి గురించి ఇంకా వింటోన్నట్లే వుంది లక్షుమ్మకు.

వీధిలోకి చూస్తూ చాలాసేపు అలాగే కూచుని వుండి పోయింది.

వక్కాకు ఎంగిలి నోట వూరటంతో ముందుకు జరిగి రెండు వేళ్ళను పెదాలకాన్చి వేళ్ల సందున్నించి వూసింది.

కుడి మోకాలి మీద చేయి వూదుకొని "రామక్రిష్ణా !" అంటూ మెల్లిగా లేచి నిల్చుని ఇంట్లోకి నడిచింది.

ఆ గూడూ యీగూడూ వెదకింది.

చిన్న వెదురు బుట్టలోని చింతపండును పట్టి చూసింది.

పక్కనే గుడ్డ సంచిలోని ఎండు మిరపకాయల్ని తడివింది.

రేకు డబ్బాలో చేయి పెడితే నాలుగు ఉల్లి గడ్డలు వేళ్లకు తగిలాయి. మనస్సు కుదుట బడింది ఆమెకు.

కావలసిన సంబరాలు లేవేమో అనుకొంది.

"సాములోరికి వూరిమిండి లేంది ముద్దదిగదు"

పైటేల కాకముందే వస్తాది చిన్నక్క 'నోరు సవ్వబడింది. లచ్చుమత్తనూరిన వూరిమిండి నాలిక్కి రాసుకుంటే గాని పానం కుదుటబడదు. రోంత తీసకరాపోమ్మా!' అని పంపినాడని వస్తాది. ఆ మాట యీ మాట చెబుతా అది గడపమానుకాడ కూచుంటే తను చింతపండూరిమిండి నూరి ఆకులో పెట్టిస్తాది.

ఎప్పుడూ జరిగే తంతే అయినా ఎప్పటి కప్పుడు కొత్తగా వుంటుంది. ఇప్పుడెందుకో మరి కొత్తదనానికి తోడు కొంత అలజడిగా వుంది మనసులో. ఎప్పుడూ ఎరుగని అనుమానపు అలజడి.

'ఎన్నెన్ని రాజ్యాలో తిరుగుంటాడు. కొత్త కొత్త రుచులెన్నో మరిగుంటాడు. ఇప్పుడీ పాత చింతపండూరిమిండి సామికి రుసిస్తదో లేదో?'

రెండేండ్లు దాటింటాదేమో ఇంగ్లీషు రాజ్యం పోయి.

పెద్ద స్వాములోరై తిరిగొచ్చినాడు.

తనాయప్ప నోటికి రుచిగా నూరగలదో లేదో!

'సెనిగెపప్పులు యేంచి చింతపండూరిమిండి నూరితే బిత్తలసామికి బోరుసి...' అనుక్కొంది.

ఆలోచన వచ్చిందే తడువు అంగడిదాకా నడిచింది.

స్టూలు మీద కూచుని ఏం కావాలో చెప్పింది. వేరుసెనగ పప్పులు తూకమేస్తూ "కొడుకులెవురూ యీ దిక్కన్నా సూస్తాన్నెట్టులేదే పెద్దమ్మా! లెక్కన్నా పంపిస్తాండారా?' అడిగాడు కొండిసెట్టి.

"ఆ సంగతులెందుగ్గానీ.. నువ్వు తూకమెయ్యబ్బీ!" చెప్పింది. "కాలమహిమ తల్లీ! కలికాల మహిమ. మొన్న బ్రమ్మం జెప్పిందు. నిన్న కాశినాయన జెప్పిందు... సాకి సంతరించి యింతోల్లన్జేసిన ముసిలితల్లి పల్లెలో కూలినాలి జేసుకొని బతకాల్సొచ్చె. వాల్లేమో

పెద్ద పెద్ద ఆఫీసర్లయి... మా రాజులై.. ఫోనన్నా జెయెచ్చు గదా!... 'సెట్టీ! మాయమ్మను పిల్చుమంటే నేను పిల్లచనా"... అంటూ పొట్లం కట్టి యిచ్చాడు.

ఒక్కక్షణం కూడా అక్కడ నిలబడలేదు ఆమె.

"యీ నా కొడుక్కు ఎప్పుడూ నా సోదే..." ప్రేమగా తిట్టుకొంది.

'యీడెంత అంగలారిస్తే మాత్రం... వాల్లొస్తారా?'

బరువెక్కిన ఎదలతో ఇంటికి నడిచింది.

పొట్లం గూట్లో పెట్టి వాకిలేసి వచ్చి పంచలో కూసానికి ఆనుకొని కూచుంది.

వక్కాకు నములుతూ ఆలోచనల్లో పడింది.

పెద్దోడు చిన్నోడు ప్రభుత్వ ఉద్యోగులయితే నడిపోడు కంట్రాక్టర్.

ముగ్గురూ పోటీలు పడి టౌనుకు పరిగెత్తారు.

కూకుటేరుని మరిచారు.

ఇక్కడి పొలము పుట్రా అమ్మి అక్కడ ఇల్లు కట్టుకొన్నారు.

తనుంది కాబట్టి యీ పాతమిద్దెను అమ్ముకుపోలేదు.

వాళ్లు టౌను చేరినందుకు తను బాధపడడం లేదు.

కనీసం చుట్టపు చూపుగా అయినా రావచ్చు గదా!

ఏడాదికొక్కసారి వచ్చి యీ యింట్లో కలకలలాడి పోవచ్చు గదా!

వాళ్లిక్కడికి రారు.

తనీ యింటిని విడిచిపొయ్యేది లేదు.

కొడుకుల్నీ, మనవళ్లనీ, మనవరాళ్ళనీ చూడాలనుకుంది. ఈ యింట్లో వాళ్ల అల్లరి వినాలనుంది.

తన్నే అక్కడికి రమ్మంటారు.

ఇల్లు వదలి తనెట్లా వెళ్లగలదు?... బతుకంతా తోడున్న యిల్లు... అది వెంటొస్తే గదా తను వెళ్లేది !

తన బతుకుదెరువుకు లెక్క పంపుతారట - అదీ వాటాలేసుకొని. నవ్వొస్తుంది.

ఎవరు పంపిన లెక్కతో తను వీళ్లందర్నీ సాకింది ?

తను కూలికి పోతే వాళ్ళకు నామోషిట.

కూలికి పోకుండాలంటే వాల్లు పంపిన దుడ్లు తీసికోవాలి.

తీసికుంటానంది... వాళ్ళిక్కడకు వస్తూ పోతూ వుంటే... కనీసం ఏడాదికి మూడు రోజులు... పెద్ద పండగ రోజులన్నా... అందరూ వొచ్చి యీ యింట్లో పండగజేసుకొని పోతే చాలు.... వాళ్ళ యిష్ట ప్రకారమే తను డబ్బు తీసికొంటానంది.

వాళ్ళు రారు.... వాళ్ల డబ్బు తను ముట్టదు.

"లచ్చుమవ్వా! బో నిమ్మలంగా కూకోనుండావే!"

"ఊరికే కూకోను నీకు పానమెట్టా వొప్పిందబ్బా!"

చేలకాడికి కూలీల్ని వెంటబెట్టుకెళ్లి పనిలో వొంచి, వొకటి రెండు మునాలు తామూ చేతులు కలిపి, సంగటి గెలుక్కు పోయేందుకు యింటికి తిరిగొస్తోన్న రైతమ్మలు - పంచలో తీరిగ్గా కూచుని వున్న లక్షుమ్మను పలుకరించి పోతున్నారు.

"అమ్మా! లచ్చుమ్మా!"

ఎదురుగా చిన్నక్క.... ఆత్మీయ భావాన్ని కలిగిస్తూ... ఏదో కొత్త ఉత్సాహం ఎదలనిండా నింపుతూ స్వాములోరి అమ్మ... ఆమెను చూస్తోంటే ఏదో ఆతృత – ఉదయం నించి వెంటాడే సన్నని అలజడి... నరనరాల్లో సరసర ఎగబాకుతోన్న అనుభూతినిచ్చే అలజడి....

వచ్చింది.... కొడుకు పంపితే వొచ్చింది. స్వాములోరు పంపితే వొచ్చింది.... అది తలవాకిటి కాడ కూచుంటే, తను చింతపండు వూరిమిండి నూరి.... ఆకులో పెట్టి...

"అమ్మే సిన్నక్కా!" అప్యాయంగా పలుకరించింది.

"రా... కూకో..." పిల్చింది.

చిన్నక్క కూచోలేదు.

"అబ్బి వొచ్చిందమ్మా ! పెద్దోడొచ్చిందు... నిన్ననే వొచ్చి సెప్పి పోదామనుకొన్నే – యాదతీరికుండాదీ!... అంగడిదాకా పొయ్యేస్చా – మల్లొస్చాలే..." అంటూ అక్కన్నించి కదిలింది.

నొసలు ముడసి చూసింది లక్షుమ్మ.

"ఇంకా పైటేల కాలేదు గదా! ఊరిమిండి కొసం తిరిగొస్తాదేమోలే..." తనకు తను సంజాయిషీ ఇచ్చుకుంది.

అంతలావుస్వాములోరిని పట్టుకొని 'అబ్బీ', 'పెద్దోడు' అనగలిగిన చిన్నక్క తల్లిదనం మీద కొంత అసూయలాంటిది కలిగింది ఆమెకు.

మోకరిల్లిన వేలాది జనం ముందు తెల్లని అంగీ తొడుక్కుని, నడుమున నల్లటి తాడు కట్టుకొని, శిలువధారియై, బైబిలు వాక్యాల్ని విన్పించే స్వాములోరిని 'ఒరే తరే' అని పిల్చుకోగలిగిన చిన్నక్క అదృష్టం – ఆమెకు ప్రేమ పూరిత ఈర్ష్యను కలిగించింది.

మొన్న మొన్నటి దాకా – స్వాములోరు అయిన కొత్తలోకూడా తను 'బిత్తుల సామీ" అని పిల్చేది అతన్ని. అంతకు మనుపయితే 'బిత్తల్నాయాలా' అని గేలిపట్టిస్తుండేది. చిన్నప్పుడయితే మరీ 'బిత్తల్నాబట్టా' అని ఒకటే కోడిగం. ఒకటి రెండుసార్లు చొక్కా పైకెత్తి పిర్రల మీద మెల్లెతో పెరికినట్టు కూడా గుర్తు.

చిన్నప్పటి నుంచీ తన నీడలో పెరిగిన వాళ్లు. తన చేతి పిడచ తిన్నవాళ్లు... పదేండ్ల పిల్లోలయ్యేదాకా మోకాళ్ల దాకా అంగీ తొడుక్కొని నిక్కరు లేకుండా బిడబిత్తల పరిగెత్తే నాయాళ్లూ...

కళ్లముందు పాత రోజులు కదలాడాయి ఆమెకు.

చిన్నక్క ఎప్పుడు తమ పొలాల్లోనే వుండేది.

తమ ఇంట మాదిగతనం చేసే ఆమె మొగుడు 'టాకదు' పురుగుముట్టి మంచి ప్రాయంలోనే పోతే – ఇద్దరు పిల్లల్ని ఎదనేసుకొని తమ పంచన్నే బతికింది. సంగటి వేళయ్యేసరికి ఎక్కడున్నాసరే అంతులేని ఆకలితో వచ్చి అమ్మ చేతిలోని ముద్ద మీద కలియబడేవాళ్లు. తన కొడుకులు వదిలేసిన పాతగుడ్డలు – పాతపుస్తకాలు – అన్నీ వాళ్లకే...

వాళ్లను సాకి, సంతరించి పెద్దోళ్లను చేసేసరికి చర్చిలోని కొవ్వొత్తి దీపెంలా కరిగిపోయింది చిన్నక్క.

తనెప్పుడూ 'బిత్తలో'డనే పిల్చేది స్వాములోరిని.

అతని పేరేమిటో కూడా తను ఖచ్చితంగా చెప్పలేక పోవచ్చు. 'బిత్తలనాబట్ట' కాస్తా 'బిత్తలనాయా'లయి, 'బిత్తలసామ'యి... యిప్పుడు స్వామలోరయి...

అతని అసలు పేరెప్పుడూ తనకు అవసరపడలేదు.

అంగడి కాన్నించి చిన్నక్క యింకా తిరిగి రాలేదు.

ఏదో ఆరాటంగా వుంది లక్షుమ్మకు.

మరేదో అనుమానపు అలజడి.

రాదేమో! అట్నించటే మాదిగిళ్లకు వెళ్లి పోతుందేమో!

అవును... తన్ను ఒంటరిదాన్ని చేశారు.

ఒంటరితనపు తుఫాను మబ్బేదో తనపైకి కమ్ముకొస్తోన్నట్లుగా అనుభూతి. తన బతుకంతా ఎంత సందడిగా వుండేదనీ!

బండెడు జనాలున్న యింట్లో పుట్టింది. అదృష్టం కొద్దీ ఉమ్మడి కుటుంబంలోనే కాలుబెట్టింది. మొగుడు, బావలు, మరదళ్లు, తోడికోడళ్లు, ఆడపడుచులతో యిల్లంతా ఎప్పుడూ సందడే సందడి.

తన కొడుకుల్ని అంతంత చదువులు చదివించకుండింటే... వాళ్లు ఉద్యోగస్తులు కాకుండింటే ఇల్లంతా సందడిగానే వుండిండేది. ముగ్గురు కొడుకులు, కోడండ్లు, మనవళ్లు, మనవరాళ్ళతో గలగలలాడుతూ సందడిగా వుండేది.

చదువు వాళ్లను తనకు దూరం చేసింది.

వాళ్లకు టౌన్‌లో సుఖం దొరకతా వుంటే అక్కడే వుండనీ తనేం కాదనటం లేదు. పెద్ద పండక్కు కాకపోయినా కనీసం ఉగాదికయినా అందరూ వొచ్చి పంచలో కూచుని వొచ్చేపోయే వాళ్లతో వరసలు కలిపి మాట్లాడతా వుంటే – అది చూస్తా తను "ఒరే పెద్దోడా... చిన్నోడా... నడిపోడా..." అంటూ పిల్చుకోవాలని వుంది.

చిన్నక్కపాటి అదృష్టం లేదు తనకు.

సందడిలో పుట్టి సందడిలో పెరిగిన తను యిప్పుడు ఒంటరి బతుకు యీదుస్తాంటే–

బతుకంతా ఒంటరితనం మోసిన చిన్నక్కకు ముసలి ముప్పన సందడి బతుకు అబ్బింది.

చిన్నక్క యిక రాదనే అర్థమైంది లక్షుమ్మకు.

అంగడి వద్దనించి అటే వెళ్లిపోయి వుంటుంది.

మరి – తనచేత వూరిమిండి నూరించుకొని తీసుకపోదా !

బహుశా స్వాములోరు అడగలేదేమో !

ఎదనిండా సన్నని అదిరిపాటు.

అట్లా ఆలోచించాలంటేనే మనస్సు నిండా వ్యతిరేకత.

చిన్నక్క తప్పకుండా వస్తుంది.

ఇంటి వద్ద నించి వస్తుంది. స్వాములోరి వర్తమానంలో వస్తుంది.

వచ్చీ రాగానే "మా సోములోరు ఆకలి మీదుండాడు. రోంత వూరిమిండి పెట్టు తల్లీ!" అని తొందర జేస్తాదేమో! అప్పటికప్పుడు రోలు కడిగి తను వూరిమిండి దంచబోయి.. ఉప్పుకారం సరిగ్గా కుదరక.. రుచి సెడి...

ముందే దంచి పెట్టుకొంటే మంచిది గదా !

"నారాయన... నారాయన..!" అంటూ మెల్లిగా లేచి ఇంట్లోకెళ్ళింది. పొయ్యిలోని బూడిదలో వేలు పెట్టి కెలికింది.

పొద్దుటి నిప్పు కణికలు ఇంకా దాగున్నాయి.

సిదుగేసి రాజేసింది.

కూరాకు చట్టి పొయ్యిమీద పెట్టి అడుగు వేడెక్కగానే చిన్న గిన్నెలోని పేరిన నెయ్యి రెండు వేళ్లతో తీసి అందులో వేసింది.

"పొద్దుబోవక యున్ననూ వేసరికి పొరుగిండ్ల దిరుగుగానీ బుద్ధిమాలిన చిత్తమూ నీ యందు బొందదే నారాయనా!"

సన్నగా పాడుకొంటూ ఉల్లిగడ్డల్ని చట్టిలో వేసి దోరదోరగా వేయించింది. నేతి జిడ్డుతో నిగనిగలాడుతోన్న చట్టిలో ఎండుమిరపల్ని ఒకసారి, వేరసెనగ పప్పుల్ని మరోసారి వేయించింది.

నారాయణ పదాల్ని పాడుకొంటూ అన్నిట్నీ తీసికెళ్లి రోటికాడ కూచుంది. తాము చిన్న పిల్లోల్లుగా వున్నప్పుడు వీధి ఆడపిల్లందర్నీ కూచోబెట్టుకొని నారాయణ శతకమంతా నేర్పించాడు భట్రాజు. అవన్నీ మధురమైన జ్ఞాపకాలు.

రోకల బడితె తుడిచి ముందుగా వేరుసెనగ పప్పుల్ని దంచి, పొడిని రోటి దరులపైకి చేర్చింది. తర్వాత మిరపకాయల్ని దంచింది. చిన్నగిన్నెలో నానబెట్టి వున్న నల్లటి చింతపండు తీసి రోట్లోవేసింది. రోటి పైనున్న ఉల్లిగడ్డల్ని రోట్లోకి తోసి బడితెతో కసాపిసా నాలుగుపోట్లు పొడిచింది. చివరగా ఉప్పు వేరుసెనగ పొడిచేసి పాకంగా నూరింది. రోకలిబడితె పైకెత్తి బోర్లా తిప్పిన అరచేతి మీద వూరిమిండి అంటించి నాలుక్కి రాచుకుంది. పులపు ఎక్కువనిపించి నాలుగు ఉప్పుకల్లులు రోట వేసింది. ఎడమచేయి చూపుడు వేలు బొటన వేళ్ల మధ్య బడితె చివరను బంధించి, కుడిచేతి మునివేళ్లతో బడితె కింద భాగాన పట్టుకొని అలవోకగా నాలుగు వలయాలు తిప్పి వదిలింది. చింతపండు నానేసిన నీళ్లు మరో చిటికెడు పోసి ఇంకో రెండు వలయాలు తిప్పి పచ్చడి జోరుజోరుగా ఉండేట్లు చూసింది. నాలుక్కి రాచుకొని ఒకటికి రెండుసార్లు లొట్టలు వేసి తన సమ్మతి తెలుపుకుంది.

ఊరిమిండిని చట్టిలోకి తోడి గూట్లో ఎత్తిపెట్టి మూకుడు మూసింది. చిన్నక్క కోసం ఎదురుచూడసాగింది.

"ఆటలన్నియు రంకులూ... నేనాడు మాటలన్నియు బొంకులూ.. నోట్లోంచి సన్నగా పదం... మనస్సులో పాతకాలపు స్మృతుల పొరలు విడివడుతూ...వాటిని తాకి పరవశిస్తూ.... లోకాన్ని మరిచింది.

సాయంత్రంగా వీధిలో జంగిడి నించి వస్తున్న గొడ్ల సవ్వడికి గాని ఆమెకు మెలకువ రాలేదు.

మెల్లిగా పంచలోకి నడిచింది.

పొద్దు కొండల్లోకి పోతోంది.

ఇంతసేపూ మైకం కమ్మిన దానిలా పడుకుండి పోయింది.

పాడి బర్రెలూ, దూళ్ల అరుపులూ, లేగల బెంగళింపులూ, ఇళ్లకు చేరుకొనే మేకల మంద సవ్వడులతో వీధంతా ఉత్సవ ఉత్సాహంగా ఉంది. బరుగొడ్ల కొట్టాల్లోంచి - కుండల్లోకి పిండుకొనే పాలధార సవ్వడులు వీధి దాకా విన్పిస్తున్నాయి.

చిన్నక్క యింకా తన వద్దకు రాలేదనే విషయం లక్షుమ్మ మనస్సును తొలుస్తూనే ఉంది.

నోటి సవ్వదనాన్ని పోగొట్టుకొనేందుకు స్వాములోరికి యింకో రుచేమైనా దొరికిందేమో! లేకుంటే – నోరే సవ్వదనానికి అలవాటు పడిందో!

'రేత్రికే పయనమవుతాడంట సోములోరు.'

తనకు కబురంపితే వెళ్లి ఆయన్ను కలవాలని ఉంది.

కబురంటే పూరిమిండి కోసం చిన్నక్క రావడమే. స్వామిని కలవాలి.

లోకమందలి సమస్యలు తీర్చే స్వామికి తనకున్న ఒకే ఒక్క సందేహాన్ని నివేదించాలి. తనకా ప్రశ్న ముడివిడటం లేదు. చాలా రోజుల్నించి అడగాలనే అనుకొంటోంది.

ఏదీ? చిన్నక్క రావాలి గదా!

స్విచ్ నొక్కి ఇంట్లో బల్బు వెలిగించింది.

చారెడు బియ్యం కుండలో పోసి కడిగి ఎసరు పెట్టి పొయ్యి మీద పడేసింది.

పుల్లలు ఎగదోస్తూ ఆలోచిస్తూనే ఉంది.

అన్నం ఉడికి యిగం పీల్చుకొనే వేళకు కూడా చిన్నక్క రాలేదు.

కొడుకులు దూరమైం తర్వాత తనకు మాట పలుకు ఎదతోడు యీ చిన్నక్కే గదా!

తన మంచి చెడ్డలు తెలిసింది. తన మనో వేదనను అర్థం ఏసికొనేదీ – ఆ చిన్నక్కే రాలేదంటే –

లక్షుమ్మకు లోలోపల ఆవేదన రగులుతూ ఉంది.

స్వాములోరు కూడా తన్ను మరిచాడు.

చిన్నప్పటి బిత్తలితనం పూర్తిగా 'మరచిపోయుంటాడు గాబట్టే తన్ను మరిచాడు. బిత్తల్నాబట్ట తనకు దూరంగా తప్పుకొన్నాడు.

బిత్తల్నాయాలు తన మాటలకు అందకుండా పోయాడు.

బిత్తలసామి తన జ్ఞాపకాలు మరిచాడు.

ఇప్పుడు స్వాములోరు అయ్యాక తన ఉనికినే విస్మరించాడు.

అన్నం కుండా, పూరిమిండి చట్టి ముందేసుకొని దీర్ఘాలోచనల్లో పడింది ఆమె. తనకు అందరూ దూరమయ్యారు.

చివరకు – ఒంటరి తనమంటే ఏమిటో తెలిసిన చిన్నక్క కూడా – మనసారా నమ్మిన స్వాములోరు కూడా –

లక్షుమ్మ అంతరాంతరాళల్లోకి ఒంటరి తనపు వేదన చలిగాలి అలలా పాకింది. కొడుకులు తనను వదలి వెళ్లినపుడు కూడా చలించని ఎద ఇప్పుడు జలదరించింది. కళ్ల నీళ్లూరాయి. ఉన్నట్టుండి స్త్రీ సహజమైన సాంప్రదాయిక ఏడుపు గుండెల్లోంచి తన్నుకొచ్చింది. గొంతు గద్గదమైంది.

"దిక్కులేరు దేవుడా!.... నాకు ఎనకాముందూ ఎవరూ లేరు పరంధాముడా!... ఏ దిక్కులేనిదాన్నయితిరా భగవంతుడా... కాకి శోకం యిచ్చినావు గదరా నారాయణ!... నాకింగ దిక్కెవ్వర్రా తండ్రీ!" అంటూ సన్నని గొంతులో హృదయవిదారకంగా రోదించసాగింది. కుళ్లి కుళ్లి ఏడవసాగింది.

అందరూ వుండి ఎవ్వరూ లేనితనం ఆమెను శోకవివశురాల్ని చేసింది. చాలాసేపు చంటిపిల్లలా ఏడుస్తూనే ఉంది.

అంతలో "అత్తా!" అన్న పిలుపు.

తలెత్తి చూసింది ఉలికిపాటుగా.

"బాగుండావా అత్తా!"

ఎదురుగా ధవళ వస్త్రాల్లో ఆజానుబాహుడైన మనిషి.

తల వెనక్కి విరుచుకొని చూసింది.

టపటప రెప్పలార్చి చూసింది. స్వాములోరు...

నేరుగా తన వద్దకే నడుచుకొంటూ వచ్చిన స్వాములోరు....

ఏసునాయనే నడిచొచ్చినట్లుగా ఎదరుగా స్వాములోరు...

"స్వామీ! వొచ్చినావా సామీ!" తత్తరపాటుతో లేవబోయింది.

"కూచో అత్తా!" లేవకుండానే అడ్డుకొంటూ తనూ ఆమెకు ఎదరుగా కూచున్నాడు స్వాములోరు.

"సామీ! ... పీట వాల్చుతా సామీ!"

"వద్దత్తా!"

"సామీ!... నిజంగానే వొచ్చినావా సామీ!... రాకుండా పోతావేమోనని బయపడ్తి సామీ! ...

"నన్నట్లా పిల్చొద్దత్తా!... నేనెవురు?...నీ బిత్తలోన్ని గాదూ!.... నీ బిత్తలోన్నత్తా!... బిత్తలోడా అను...బిత్తల్నాబట్టా అను...నీ నోట తిట్టించుకొని, నీ చేతి వూరిమిండి నాలుక్కి రాచుకొని పోతేనే యీ వూరికి వచ్చి వెళ్లిన తృప్తి... లేకుంటే ఏదో పొగొట్టు కున్నెట్టుంటాదత్తా.... ఏదీ?... వూరిమిండేదీ?... " చేయి చాచాడు.

అప్పుడు భయమేసింది లక్షుమ్మకు.

కారణం తెల్వీ భయం.

కుండా, చట్టీ స్వాములోరి ముందుకు జరిపింది.

"నీ చేత్లో రోంత వూరిమిండెయ్యిత్తా!" అడిగాడు.

రెండు వేళ్లతో పచ్చడి తీసి అతని చేత వేసింది.

చింతపండు పచ్చడి నాలుక్కి రాచుకొని అరమోడ్పు కళ్ళతో తృప్తిగా లొట్టలేశాడు స్వాములోరు.

"ఒక్క పిడచ బువ్వ..." అన్నాడు దోసిలి చాచి అభ్యర్థిస్తున్నట్లుగా.

గరిటతో వేడి వేడి అన్నం దోసిట్లో వడ్డించింది.

రెండు వేళ్ల ఊరిమిండి అన్నం మీద వేసింది.

పొగలు సెగలూదుకొంటూ అచ్చు పొణంలో తిన్నట్లుగా అనుభూతిస్తూ భోంచేశాడు.

అతనికేసీ తదేకంగా చూస్తోంది ఆమె.

ఇంత గొప్ప స్వాములోరు... తనదాకా వచ్చి తన యింట అడుగుపెట్టి తనముందు 'బిత్తల్నాబట్ట' కావాలని తలపోస్తూ ఉంటే ఆమెకు నమ్మశక్యం కాకుండా ఉంది. భావావేశంతో దుఃఖం తన్నుకొస్తూ వుంది.

"సామీ! నేనొక్క మాటడుగుతా సెబ్తావా?" అంది గద్గదంగా. అడగమన్నట్లుగా చూశాడు.

"నా చేతి వూరిమిండి నీకు రుసించినట్టుగా నా కొడకల కెందుకు రుసించదు సామీ? వాల్లకెందుకు రుసి దొరకలేదో సెప్పు సామీ!" అంది కన్నీరు గుడ్లమీద అలుముకొంటోండగా.

ఆమెకేసి తదేకంగా చూశాడు స్వాములోరు.

సమాధానమేమీ చెప్పకుండా వెనక్కి జరిగి గోడకానుకొని కూచుని నిశ్చలంగా ఆమెనే చూస్తుండి పోయాడు.

◆ *సాహిత్య నేత్రం త్రైమాసపత్రిక (12వ సంచిక) - జూలై, 2006* ◆